ప్రజాశక్తి
గురువారం 21 డిసెంబర్ 2023
5
విజయనగరం

పోలింగ్ కేంద్రాల్లో బిఎల్ఒల ఫోన్ నంబర్లు

విజయనగరం : ప్రతీ పోలింగ్ స్టేషన్లో బిఎల్ఒ పేరు, ఫోన్ నంబర్లు డిస్ప్లే చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. ఓటర్లు తమ సందేహాలను నివృత్తి చేసుకొనేందుకు ఈ నంబర్లు ఉపయోగపడతాయని అన్నారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో బుధవారం కలెక్టరేట్లోని తన ఛాంబర్లో సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం జరుగుతున్న ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై సమీక్షించారు. రాజకీయ పార్టీల అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుత ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా వచ్చిన వివిధ దరఖాస్తుల పరిశీలన ఈనెల 26తో పూర్తి అవుతుందని చెప్పారు. అనంతరం ఓటర్ల జాబితాలను తయారు చేస్తామని చెప్పారు. అయితే ఇప్పుడు కూడా ఓటు నమోదు చేసేందుకు దరఖాస్తులు వస్తున్నాయని, వాటిని జనవరి 5న ఓటర్ల జాబితా ప్రచురించిన తరువాత పరిశీలిస్తామని చెప్పారు. సమావేశంలో డిఆర్ఒ ఎస్.డి అనిత, ఆర్డిఒలు వెంకటేశ్వర్లు, సుదర్శన దొర, నూకరాజు, సుధారాణి, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ శ్రీకాంత్, సిబ్బంది, పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

యుద్ధం మొదలైంది

- టిడిపి, జనసేన కలయికతో జగన్‌కు భయం
- వైసిపి పాలనలో పెరిగిన నిరుద్యోగం
- విశాఖ ఉక్కు ప్రైవేటీకరణనూ అడ్డుకోలేకపోయారు
- యువగళం బహిరంగ సభలో టిడిపి యువనేత లోకేష్

టిడిపి , జనసేన అధినేతల మాటామంతీ

అభివాదం చేస్తున్న యువతులు

బహిరంగ సభకు హాజరైన జనసంద్రం

హోర్డింగ్ పైకి ఎక్కిన అభిమానులు

ప్రజాశక్తి-విజయనగరం ప్రతినిధి, కోట, భోగాపురం

'యుద్ధం ఇప్పుడే మొదలైంది.. ఇది ముగింపు కాదు.. తాడేపల్లి ప్యాలెస్ గోడలు బద్దలు గొట్టే వరకూ ఆగదు' అని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. భోగాపురం మండలం పోలిపల్లి సమీపన నిర్వహించిన యువగళం-నవశకం విజయోత్సవ సభలో లోకేష్ మాట్లాడారు. తాను చేపట్టిన యువగళం పాదయాత్ర, జనసేన అధినేత పవన్ కల్యాన్ చేపట్టిన వారాహి యాత్రతో సిఎం జగన్‌కు భయం పట్టుకుందన్నారు. సాగనిస్తే పాదయాత్ర అవుతుందని, లేదంటే దండయాత్ర అవుతుందని అన్నారు. అక్రమ అరెస్టులు, నిర్బంధాలకు పాల్పడడంతో అదే చేసి చూపించానని అన్నారు. చంద్రబాబును అరెస్టు చేసినా తప్పు ఉన్నట్టు తేల్చలేకపోయాడన్నారు. జగన్‌ను అరెస్ట్ చేస్తే ప్రతి కేసుకూ ఒక స్కామ్ బయట పడుతుందని అన్నారు. ఆడుకుందాం ఆంధ్రా అంటూ జగన్ ఇప్పుడు కొత్త నాటకానికి తెర లేపారని విమర్శించారు. ఇందులో ఆటగాళ్లంతా అవినీతి మరకలు అంటించుకున్న వారేనన్నారు. ఈ ఐదేళ్ల పాలనలో జగన్ ఎన్నో విధ్వంశాలు సృష్టించాడని అన్నారు. తన పాతయాత్రలో అనేక సమస్యలు తన దృష్టికి వచ్చాయని తెలిపారు. పేదలు చదువుకోసం, పొట్టకూటికోసం ఎదురు చూస్తున్నారని, రైతులు, నిరుద్యోగుల సమస్యలు పేరుకుపోయాయని అన్నారు. 31మంది ఎంపిలు ఉండి కూడా విశాఖ ఉక్కు విక్రయాన్ని అడ్డుకోవడం లేదన్నారు. పైగా ఉక్కు భూములు కొట్టేసెందుకు చూస్తున్నారని, ఋషికొండకు గుండు కొట్టి దోచుకునేందుకు చూస్తున్నాడని విమర్శించారు. విశాఖలో తాను ఎన్నో ఐటీ పరిశ్రమలు ఏర్పాటు చేశానని, జగన్ వచ్చాక ఉన్న పరిశ్రమ ఇతర రాష్ట్రాలకు పోతున్నాయి. బొబ్బిలి గ్రోత్ సెంటర్‌లోనూ పరిశ్రమలు ఏర్పాటు చేయలేకపోయారని అన్నారు. విశాఖ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. పచ్చ బటన్ నొక్కి ... మరో వైపు రెడ్ బటన్ నొక్కి ఛార్జీలు, నిత్యావసర సరుకుల ధరలు, మద్యం ధరలు పెంచారని విమర్శించారు. జాబ్ కేలండర్ మాట తప్పి నిరుద్యోగులకు మోసం చేశారని దుయ్యబట్టారు. ఉత్తరాంధ్ర సృజల స్రవంతి కూడా నిర్మించలేదని విమర్శించారు. సిపిఎస్‌ను రద్దు చేస్తామని ఉద్యోగులను మోసం చేశారని, చివరికి వేతనాల్లో కోత పెట్టి పోలీసులకు కూడా మోసం చేశాడని అన్నారు. జగన్ పని అయిపోయిందని, అందుకే ఎమ్మెల్యేలను ట్రాన్స్‌ఫర్ చేస్తున్నారని అన్నారు. జగన్ ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీశారని అన్నారు. లక్షకోట్లు దోచేసిన వ్యక్తి, ప్యాలెస్‌లో ఉంటున్న వ్యక్తి పేదవాడు అవుతాడా అని ప్రశ్నించారు. ప్రజల ఆత్మ గౌరవానికి మధ్య యుద్ధం జరుగుతోందని, మూడు నెలల్లో ప్రజా స్వామ్యం పవర్ ఏంటో చూపాలని అన్నారు. కష్ట కాలంలో పవన్ కల్యాణ్ ఫోన్ చేసి ధైర్యం చెప్పారని, యువగళం పాదయాత్ర లో ఎంతో మంది సహకరించారని అన్నారు.

మాట్లాడుతున్న బాలకృష్ణ

- జనసేన పొలిటికల్ అడ్వైజరీ కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ టిడిపి, జనసేన కలిసి ముందుకు వెళ్తే ప్రజారంజకమైన ప్రభుత్వం ఏర్పాటవుతుందన్నారు. ఈ రాష్ట్రానికి వచ్చిన కష్టకాలంలో జనసేన, టిడిపి కలిసి పనిచేసేందుకు నిర్ణయించుకున్నాయన్నారు. ఐటి అభివృద్ధి కుంటుబడటంతో నిరుద్యోగ సమస్య ఏర్పడిందన్నారు. సంక్రాంతి లోపు చక్కటి మేనిఫెస్టో రూపొందించుకుంటామని, ఇరు పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి పనిచేయాలని చెప్పారు.
- టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు మాట్లడుతూ యువనేత లోకేశ్ పాదయాత్రకు సైకో జగన్ ఎన్నో ఆటంకాలు సృష్టించాడన్నారు. ఈ సభను చూసి జగన్ వెన్ను వణుకుతుందన్నారు. టిడిపి, జనసేన కలయికతో బలహీన వర్గాలను దూరం చేయడానికి జగన్ ప్రయత్నిస్తున్నారన్నారు. ఉత్తరాంధ్రను విజయ సాయిరెడ్డి, సుబ్బారెడ్డిలకు కట్టబెట్టారని విమర్శించారు. సిగ్గుంటే మంత్రి బొత్స సత్యనారాయణ, ధర్మాన ప్రసాదరావు ఆ పార్టీకి, పదవులకు రాజీనామా చేయాలన్నారు. 100 రోజుల్లో వైసిపిని బంగాళాఖాతంలో కలిపితే తప్ప ప్రజలకు బతుకులేదన్నారు.
- సినీనటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ మాట్లాడుతూ వైసిపి అక్రమాలు, అన్యాయాలకు అడ్డుకట్ట వేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఎన్‌టిఆర్ ప్రభంజనం నెమరు వేసుకునేలా నేడు జన ప్రభంజనం కనిపిస్తోందన్నారు. చంద్రబాబు ఎంతో దూరదృష్టి గల నాయకుడన్నారు. ఇటీవల కాలంలో పవన్ కళ్యాణ్ సినిమాల్లో కన్నా రాజకీయాల్లోనూ, ప్రజా సేవలోనూ ఎక్కువగా ఉంటున్నారని గుర్తు చేశారు. ఈ ప్రభుత్వంలో ఉద్యోగులకు వేతనాలు కూడా సకాలంలో అందడం లేదన్నారు. కనకపు సింహాసనం మీద శునకం కూర్చున్నట్టుగా ఉందని సీఎం జగన్‌ను విమర్శించారు. రాజధాని కోసం భూములు త్యాగం చేసిన రైతులకు జగన్ మోసం చేశాడని అన్నారు.
- శ్రీకాకుళం ఎంపి కింజరాపు రామ్మోహన్‌రావు మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో ఈ సభ ఏర్పాటు చేసుకోవడం చరిత్ర ఘట్టమన్నారు. ఇది ముగింపు కాదని, ఇప్పుడే ప్రారంభమైందని అన్నారు. నాలుగున్నరేళ్లలో ప్రజలను అనేక ఇబ్బందులు పెట్టారన్నారు. నవశకం ఊపు అందుకుందన్నారు.
- జనసేన నాయకులు పంచకర్ల రమేష్ మాట్లాడుతూ రాష్ట్రానికి దశ దిశ చూపడానికి ఎన్ని అడ్డంకులు సృష్టించినా పాదయాత్ర ముగింపు చేశారన్నారు. సభకు శ్రీకాకుళం ఎంపి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, పొలిట్‌బ్యూరో సభ్యుల వర్ల రామయ్య అధ్యక్షత వహించారు. పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, ఎంపిలు, మాజీ మంత్రులు, నియోజకవర్గాల ఇన్‌ఛార్జులు పాల్గొన్నారు.

బహిరంగ సభ వేదికపై నుంచి అభివాదం చేస్తున్న నారా లోకేష్

మీడియా, విఐపి గ్యాలరీల్లోకి దూసుకొస్తున్న కార్యకర్తలు

చేతులెత్తేసిన వాలంటీర్లు

సభకు భారీగా టిడిపి, జనసేన కార్యకర్తలు తరలిరావడంతో వారిని నియంత్రించడంలో యువగళం వాలంటీర్లు చేతులెత్తేశారు. దీంతో పలుచోట్ల తోపులాటలు చోటు చేసుకున్నాయి. వేలాదిగా వచ్చిన వారిని నియంత్రణ చేయడంలో వాలంటీర్లు చేతు లెత్తేశారు. బారికేడ్లు దూకి వచ్చిన వారిని నియంత్రించడంలో వాలంటీర్లకు సాధ్యం కాలేదు. సభ ముగింపు అనంతరం బయటకు వెళ్లేందుకు మహిళలు, వృద్ధులు అనేక అవస్థలు పడ్డారు. ట్రాఫిక్ స్తంభించిపోయి కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి.

ఎన్‌టిఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నారా లోకేష్

బహిరంగ సభకు హాజరైన నారా, నందమూరి కుటుంబ సభ్యులు


బహిరంగ సభ వేదికపై టిడిపి, జనసేన నాయకులు

ఖోఖో పోటీలకు దిలీప్ ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాయపూర్‌లో ఈ నెల 21 నుండి 25 వరకు జరుగు జాతీయ ఖోఖో పోటీలకు రాష్ట్ర జట్టులో దాసన్నపేటకు చెందిన బార దిలీప్ స్థానం సాధించాడు. గత నెలలో చిత్తూరులో జరిగిన రాష్ట్రస్థాయి జూనియర్ బాల బాలికల ఖోఖో పోటీలలో విజయనగరం జిల్లా జట్టు తృతీయ స్థానం సాధించింది. దిలీప్ విజయనగరం ప్రభుత్వ జూనియర్ కాలేజిలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. దిలీప్ ఎంపిక పట్ల కళాశాల ప్రిన్సిపాల్, ఖోఖో అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు విజయలక్ష్మి , సత్యనారాయణ చిన్ననాయుడు హర్షం వ్యక్తం చేశారు.

'కడలికి' జాతీయ స్థాయి పురస్కారం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

జరజాపుపేటకు చెందిన కవి, రచయిత విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు కడలి ప్రకాశరావుకు జాతీయ స్థాయి పురస్కారం లభించింది. హైదరాబాద్‌లో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన చినుకు కల్చరల్ సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన బాలోత్సవం గేయాల జాతీయ స్థాయి పోటీల్లో విజేతగా నిలిచి పురస్కారం సాధించారు. సంస్థ అధ్యక్షులు పివిఎన్ మూర్తి, విశాలాక్షి, స్థానిక కలెక్టర్ ఏనుగు నరసింహ రెడ్డి చేతుల మీదుగా పురస్కార, ప్రశంసా పత్రం అందుకున్నారు. కడలిని పలువురు గ్రామ పెద్దలు తదితరులు అభినందించారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె

- రెగ్యులరైజేషన్ , హెచ్‌ఆర్ పాలసీ అమలుకు డిమాండ్
- కలెక్టరేట్ వద్ద నిరసన దీక్ష

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జెఏసి అధ్వర్యంలో ఉద్యోగులు సమ్మె చేపట్టారు. బుధవారం నుంచి ఉద్యోగులు విధులు బహిష్కరించి సమ్మెలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ ఎదుట చేపట్టిన నిరసన దీక్షను ఉద్దేశించి ఆర్‌పిల యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.గురువులు, డేటా ఎంట్రీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కార్యదర్శి శ్రీనివాస్, ఎంఇఎస్ కో ఆర్డినేటర్‌ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఉమా శంకర్, పార్ట్ టైం అధ్యాపకుల సంఘం జిల్లా అధ్యక్షులు రవీంద్రబాబు, మండల అకౌంటెంట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు రామకృష్ణ, మెసెంజర్ అసోసియేషన్ అధ్యక్షులు గణేష్, డిపిఒ అసోసియేషన్ అధ్యక్షులు రాంబాబు మాట్లాడారు.

విద్యాశాఖ పరిధిలో పనిచేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యలు పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. పిఆర్‌సి అమలు చేయకుండా, నెలలు తరబడి వేతనాలు విడుదల చేయకపోవడం దుర్మార్గమన్నారు. మినిమం ఆఫ్ టైమ్ స్కేల్ పై జీఓలు మీద జీవోలు ఇచ్చి, అమలు చేయడం లేదన్నారు. ఉద్యోగుల మధ్య విబేధాలు, విభజన సృష్టించే విధానాలు అమలు చేస్తున్నారని అన్నారు. పాత వారికి జీతం పెంచకుండా, కొత్తగా నియమితమైన వారికి జీతం పంచే సాంప్రదాయాన్ని ప్రారంభించారన్నారు. పార్ట్ టైం పేరుతో తక్కువ జీతాలు ఇచ్చే విధానాలను అమలు చేస్తున్నారని దుయ్యబట్టారు. ఎన్నికల ముందు ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని, సమాన పనికి సమాన వేతనం అమలు చేస్తామని, అన్ని విధాలుగా కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్, పార్ట్ టైం ఉద్యోగుల కుటుంబాలను ఆదుకుంటామని చెప్పి, ఒక్క సమస్యకు కూడా శాశ్వత పరిష్కారం చూపలేద న్నారు. సమగ్రశిక్ష కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్, పార్టైం ఉద్యోగులు విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యులర్ చెయ్యాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సమగ్రశిక్షా కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (జెఏసి) నాయకులు,ఉద్యోగులు పాల్గొన్నారు.

నిరసన దీక్షలో పాల్గొన్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

మహిళలు పారిశ్రామికంగా ఎదగాలి

- రక్తహీనతపై మహిళా సంఘాలు అవగాహన కలిగించాలి
- జిల్లా సమాఖ్య సమావేశంలో కలెక్టర్ నాగలక్ష్మి

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లాలో ఫుడ్ ప్రాసెసింగ్‌కు ఎక్కువగా అవకాశాలు ఉన్నాయని, అందుబాటు లో ఉన్న వనరులను వినియోగించుకుంటూ జిల్లా అవసరాలకు తగ్గట్టుగా వ్యాపారాలను విస్తరించుకోవాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి మహిళలకు సూచించారు. ముఖ్యంగా అంతర్జాతీయ ఎయిర్‌పోర్ట్ రానున్న దృష్ట్యా ఇప్పటినుండే ప్రణాళికలు తయారు చేసుకోవాలని తెలిపారు. బుధవారం మహిళా ప్రాంగణం సందర్శించి జిల్లా సమాఖ్య సమావేశం లో పాల్గొని కలెక్టర్ ప్రసంగించారు. తొలుత మహిళా ప్రాంగణం ఆవరణలో మొక్కలు నాటి, మహిళలతో నిర్వహించబడుతున్న నర్సరీని సందర్శించారు. అదే ఆవరణ లో కూరగాయల విత్తనాలను చల్లి మహిళలతో ముచ్చటించారు. నర్సరీ వలన, అక్కడ పండిస్తున్న కూరగాయలు, పూల వలన నెలకు ఎంత సంపాదిస్తున్నారని వివరాలను అడిగారు. అనంతరం జరిగిన సమావేశంలో మహిళలతో ముఖా ముఖి ముచ్చటించారు. జిల్లా సమాఖ్య ద్వారా చేపడుతున్న కార్యక్రమాలను, వారు చేస్తున్న వ్యాపారాలను, కార్యకలాపాలను కలెక్టర్ కు సమాఖ్య ఇసి సభ్యులు వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ మహిళా సంఘాల ద్వారా మహిళలు, పిల్లల్లో రక్త హీనత లేకుండా అవగాహన కలిగించాలని తెలిపారు. బాల్య వివాహాలు జరగకుండా చూడాలని, బాల్య వివాహాల వలన కలిగే దుష్ప్రభావాలపై గ్రామాల్లో చైతన్యం కలిగించాలని తెలిపారు. జిల్లాలో బాల్య వివాహాలు పూర్తిగా ఆగిపోవాలని, అందుకు మహిళలు నడుం కట్టాలని అన్నారు. ప్రభుత్వం ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం ద్వారా 5 రకాల క్రీడలలో పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీలకోసం ప్రతి ఒక్కరూ సచివాలయ పరిధి లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు.

డిఆర్‌డిఎ పీడీ కళ్యాణ చక్రవర్తి మాట్లాడుతూ జిల్లా సమాఖ్య ద్వారా అనేక ఆర్థిక కార్య కలాపాలు జరుపుతూ రూ.7.8 కోట్లు డిపాజిట్ చేసుకున్నారని వివరించారు. పౌల్ట్రీ , డైరీ, మిల్లెట్ ప్రాసెసింగ్ తదితర వ్యాపారాలకు రుణాల కోసం బ్యాంకు లు కూడా ముందుకు వస్తున్నాయని తెలిపారు. సమావేశంలో ఎపిడి సావిత్రి, జిల్లా సమాఖ్య అధ్యక్షులు వెంకటలక్ష్మి, మండల సమాఖ్య అధ్యక్షులు, ఇసి సభ్యులు, డిపిఎంలు పాల్గొన్నారు.

ఉన్నత చదువుల్లో స్ఫూర్తికావాలి

ఆరుగురు విద్యార్థులకు జగనన్న విదేశీ విద్యాదీవెన రూ.64.54 లక్షలు విడుదల

ప్రజాశక్తి-విజయనగరం

విదేశీ విద్యాదీవెన, సివిల్ సర్వీసెస్ అభ్యర్థులకు ఆర్థిక సహాయం విడుదల కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ తన క్యాంపు కార్యాలయం నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సు ద్వారా బుధవారం ప్రారంభించారు. జగనన్న విదేశీ విద్యాదీవెన కింద జిల్లాలోని ఆరుగురు విద్యార్థుల విదేశీ విద్యకోసం రూ.64.54 లక్షలు, సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ ఉత్తీర్ణులై మెయిన్ పరీక్షకు హాజరవుతున్న ఆరుగురు అభ్యర్థులకు ఒక్కొక్కరికీ రూ.1 లక్ష వంతున రూ.6 లక్షలు విడుదల చేశారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్న అనంతరం జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, డిసిసిబి చైర్మన్ వేచలపు చినరామునాయుడు, డిసిఎంఎస్ చైర్మన్ అవనాపు భావన, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి బి.రామానందం, గిరిజన సంక్షేమ అధికారి చంద్రశేఖర్, బి.సి.సంక్షేమ సహాయ అధికారి యశోదనరావు తదితరులు పాల్గొన్నారు.



చెక్కు అందిస్తున్న జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, కలెక్టర్ నాగలక్ష్మి

ఉన్నత స్థాయికి ఎదగాలన్నదే సిఎం ధ్యేయం

పేద విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలన్న లక్ష్యంతోనే ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి విదేశీ విద్యాదీవెన పథకాన్ని చేపట్టారని జిల్లాపరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. ఒక్కో విద్యార్థి చదువుపై రూ.90 లక్షల వరకు ఈ పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేస్తూ పేద విద్యార్థుల ఉన్నత విద్య కలలను సాకారం చేస్తోందన్నారు.

మెడికల్ రిప్‌ల సమ్మె

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మందుల ధరలు తగ్గించాలని, మందులపై జిఎస్‌టి ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ జాతీయ ఫెడరేషన్ (ఎఫ్ఎంఆర్ఐ) పిలుపు మేరకు ఎపి మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్ యూనియన్ ఆధ్వర్యాన బుధవారం దేశ వ్యాప్త సమ్మెలో భాగంగా జిల్లాలో సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ధర్నాను ఉద్దేశించి యూనియన్ రాష్ట్ర నాయకులు యుఎస్ రవికుమార్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.శశిధర్, సూర్య భగవాన్ మాట్లాడుతూ 1976లో ఏర్పడిన సేల్స్ ప్రమోషన్ ఎంప్లాయిస్ యాక్ట్ ఇంతవరకు అమలు జరగలేదని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ యాక్ట్‌కు తూట్లు పొడుస్తుందని, వెంటనే ఈ యాక్టును పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. మెడికల్ రిప్రజెంటేటివ్‌లకు చట్టబద్ధమైన పని విధానాలను రూపొందించాలని డిమాండ్ చేశారు. మందుల ధరలు తగ్గించాలని అత్యవసర నిత్యవసర మందులు ప్రభుత్వ ఆసుపత్రిలో పేదలకు ఉచితంగా ఇవ్వాలని, ప్రభుత్వ రంగ మందుల కంపెనీలైన హెచ్ఎల్ లాంటి కంపెనీలను పునరుద్ధరించాలని కోరారు. మందులపై జిఎస్‌టి ఎత్తివేసి, నకిలీ నాసిరకం మందులను అరికట్టాలని, నల్ల బజారులో మందుల అమ్మకాలను ఆపాలని కోరారు. కార్యక్రమంలో కోశాధికారి డి ఎల్ ఎన్ మూర్తి, మెడికల్ రిప్‌లు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న మెడికల్ రిప్స్

రసవత్తరంగా మహిళా కబడ్డీ పోటీలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని మహిళా పార్కులో రాష్ట్రస్థాయి మహిళా కబడ్డీ పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి నేతృత్వంలో ప్రారంభమైన ఈ పోటీల్లో రాష్ట్రవ్యాప్తంగా పది జట్లు పాల్గొంటున్నాయి. బుధవారం జరిగిన కబడ్డీ పోటీలో మహిళలు హోరా హోరీగా తలపడ్డారు. ముందుగా క్రీడాకారులు డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణిని పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి మాట్లాడుతూ చరిత్రలో తొలిసారి మహిళా కబడ్డీ పోటీలు నిర్వహించడం గర్వంగా ఉందన్నారు. విజేతలకు మొదటి బహుమతిగా 50 వేలు, రెండో బహుమతిగా 40 వేలు, మూడో బహుమతిగా రూ.30 వేలు, నాలుగో బహుమతిగా రూ.20వేలతో పాటు, ట్రోఫీలను కూడా బహుకరించనున్నట్లు తెలిపారు.

కబడ్డీ ఆడుతున్న క్రీడాకారిణులు

మున్సిపల్ కార్మికుల సమ్మె నోటీసు

ప్రజాశక్తి-బొబ్బిలి

మున్సిపల్ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేసి, సమాన పనికి సమాన వేతనం ఇవ్వకపోతే సమ్మె చేస్తామని సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ పట్టణ అధ్యక్షులు గౌరీష్ హెచ్చరించారు. సమ్మె నోటీసును బుధవారం మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావుకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వస్తే కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చిన సిఎం జగన్మోహన్‌రెడ్డి విస్మరించారన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సుప్రీంకోర్టు చెప్పినా ఇవ్వడం లేదన్నారు. పర్మినెంట్ కార్మికులు, ఉద్యోగులకు సిపిఎస్ రద్దుచేయాలని కోరారు. నిత్యావసర సరుకుల ధరలు రోజురోజుకూ పెరుగుతున్నా వేతనాలు పెరగడం లేదన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే ఈనెల 26 నుంచి సమ్మె చేస్తామన్నారు.

రోడ్డు పనులు పరిశీలన

ప్రజాశక్తి-వేపాడ

రోడ్డు పనులు పరిశీలిస్తున్న ఆర్‌అండ్‌బి అధికారులు

మండలంలోని సోంపురం కూడలి నుంచి ఆనందపురం కూడలి వరకు చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులను బుధవారం ఆర్‌అండ్‌బి అధికారులు పరిశీలించారు. సుమారు రూ.35.37 కోట్లతో సుమారు 13 కిలోమీటర్ల మేర పనులు చేపట్టారు. ఇంకా మూడు కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మించాల్సి ఉంది. రోడ్డు నాణ్యతను ఎస్ఇ కె.విజయశ్రీరాం పరిశీలించారు. అర కిలోమీటర్ మాత్రమే తారు రోడ్డు, మిగతా చోట్ల సిసి రోడ్లు, కల్వర్టు పనులు చేయాల్సి ఉందని ఎస్ఇ తెలిపారు. ఇంతవరకు రూ.22 కోట్ల పనులు చేసినట్లు చెప్పారు. మిగిలిన పనులు కూడా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ పరిశీలనలో డిఇ శ్రీనివాసరావు, ఎఇ బి.వాసుదేవరావు, జెఇ కె.వి.రమణ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని 44,47 డివిజన్లలో కోటి 9లక్షల రూపాయలతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు మేయర్ విజయలక్ష్మి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ ప్రజా సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకు అవసరమైన నిధులను కేటాయిస్తూ అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో 47వ డివిజన్ కార్పొరేటర్ పట్నాన పైడిరాజు, 47వ డివిజన్ కార్పొరేటర్ శైలాడ ఈశ్వరమ్మ, జోనల్ ఇన్చార్జి కోనర్ నారాయణ, దుబే తదితరులు పాల్గొన్నారు. నగరంలోని 23,24 డివిజన్లో రూ.43 లక్షలతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు.కార్యక్రమంలో కేదార్ శెట్టి లక్ష్మణమూర్తి, పిళ్లా క్రాంతి పాల్గొన్నారు.

'ప్లాస్టిక్-ఫ్రీ క్యాంపస్'గా సీతం

ప్రజాశక్తి-విజయనగరం

స్థానిక గాజులరేగ పరిధిలోగల సీతం ఇంజినీరింగ్ కళాశాలలో సుస్థిరాభివృద్ధి లక్ష్యాలలో భాగంగా 'ప్లాస్టిక్-ఫ్రీ క్యాంపస్' అనే కార్యక్రమాన్ని నిర్వహించడం ద్వారా పర్యావరణ సవాళ్లను పరిష్కరించే దిశగా ఒక ముఖ్యమైన అడుగు వేసింది. డిస్ట్రిక్ట్ ఎకో ఎన్‌జిఒ 2023లో భాగంగా సీతం ఇంజినీరింగ్ కళాశాలలో 'ప్లాస్టిక్-ఫ్రీ క్యాంపస్' ను అమలు చేసింది . ఈ నెల 6 నుంచి వివిధ స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలపై అవగాహన వీడియో ప్రచారం ప్రారంభించింది. సభ్యులు పాలిథిన్ బ్యాగ్ చర్రితను అధ్యయనం చేసి ప్రత్యామ్నాయ పరిష్కారాలను సూచించడానికి వీడియోలను తయారు చేశారు. పర్యావరణ అభివృద్ధిని, డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లను విస్తృతంగా ఉపయోగించడానికి విద్యార్థులు, అధ్యాపకుల నుంచి సానుకూల స్పందన లభించింది. ఈ సందర్భంగాగానే కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు మాట్లాడుతూ విద్యార్థులు ఇలాంటి తరాలకు మంచి భవిష్యత్తును సృష్టించేందుకు సుస్థిర అభివృద్ధి ఒక నిబద్ధత అని పునరుద్ఘాటించారు.కార్యక్రమంలో సీతం కళాశాల ప్రిన్సిపాల్ డివి రామమూర్తి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆస్తమా పట్ల అప్రమత్తంగా

ప్రజాశక్తి-బొబ్బిలి

ఆస్తమా (ఉబ్బసం) పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉంటూ తగు జాగ్రత్తలు తీసుకుంటే ఆ వ్యాధి నుంచి రక్షణ పొందవచ్చని శ్వాసకోశ వ్యాధుల నిపుణులు డాక్టర్ మోనిషా వీణ తెలిపారు. బుధవారం బొబ్బిలి రోటరీ క్లబ్, క్వీన్స్ ఎన్ఆర్ఐ ఆసుపత్రి సంయుక్త నిర్వహణలో ఉచిత ఆస్తమా పరీక్షలు, అవగాహన కార్యక్రమాన్ని రోటరీ క్లబ్ అధ్యక్షులు జెసి రాజు, ఎన్ఆర్ఐ సిఇఒ ఎన్.శ్రీనివాస్ నిర్వహించారు. ఈ శిబిరాన్ని డాక్టర్ పి.రామ్‌కుమార్ ప్రారంభించారు. ఆస్తమాతో బాధపడుతూ వైద్య శిబిరానికి వచ్చిన రోగులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి తగు సూచనలు అందించారు. ఈ సేవలకుగాను డాక్టర్ రామ్‌కుమార్, డాక్టర్ మోనిషాను రోటరీ క్లబ్ అధ్యక్షులు సత్కరించారు. కార్యక్రమంలో రోటరీ ప్రతినిధులు రాముక్కున్న, కృష్ణమోహన్, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు ప్రారంభం

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని సింగరాయి, జాకేరు గ్రామాల్లో బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేశారు. వీటిని ఆయా గ్రామాల సర్పంచులు ఎస్.వెంకట్రావు, బుడ్డ చిన్నమ్మలు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపిటిసి రమణ, నాయకులు బుడ్డ అప్పలనాయుడు, బుడ్డ కృష్ణ, మిడతన అప్పన్న, మిడతన జోషి, వివిఎం కోమలి, ఎల్.దుర్గాభవాని, డిఇఒ ఎస్.లావణ్య, సిహెచ్.రాజు, టిఎఎ ఇంద్ర, హెల్పర్లు సింహాద్రి నాయుడు, శ్రీనివాసరావు, నాగరాజు, జగ్గారావు, రైతులు పాల్గొన్నారు.

వైసిపి యువజన విభాగం ప్రధాన కార్యదర్శిగా తులసి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

చనమల్ల పేటకు చెందిన యువకుడు చనమల్ల తులసిని వైసిపి యువజన విభాగం ప్రధాన కార్యదర్శిగా నియమించారు. బుధవారం వైసిపి అధిష్టానం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా యువజన విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి చనమల్ల తులసి మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి అందరి సహకారంతో మరింత కృషి చేసి రాబోయే ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేస్తానని తెలిపారు. తన మీద నమ్మకంతో బాధ్యత పెట్టిన నాయకుల నమ్మకాన్ని ఒమ్ము చేయకుండా కృషి చేస్తానని తులసి తెలిపారు.

'బిజెపి బిసిలను అణగదొక్కుతోంది'

ప్రజాశక్తి - పూసపాటిరేగ

బిజెపి బిసిలను అనగదొక్కుతొందని చెప్పడానికి ఇబ్బంది పడుతున్నామని బిజెపి జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి పతివాడ రాజేష్ అన్నారు. బుధవారం ఆయన పూసపాటిరేగలో విలేకర్లతో మాట్లాడుతూ జిల్లాలో భారతీయ జనతా పార్టీ తీరు చూస్తుంటే ఎటువైపు వెళుతుందో అర్థం కావటం లేదన్నారు. నెల్లిమర్ల అసెంబ్లీ పరిధిలో పార్టీ పరిస్థితి పూర్తిగా దిగజారిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అసెంబ్లీకి కన్వీనర్‌గా బూర్లె శ్రీధర్ నియామకం అయి సంవత్సరం గడుస్తున్నా ఇప్పటికీ మండల పార్టీ అధ్యక్షులు నియమించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. జిల్లా పార్టీ అధ్యక్షుల పనితీరు విచిత్రంగా ఉందన్నారు. ఈ మధ్య గజపతినగరంలో బిజెపి జిల్లా ఒబిసి మోర్చా సమావేశం బహిష్కరించమని స్వయంగా వాట్సాప్ గ్రూపులో కార్యకర్తలకు పిలుపు ఇవ్వటం విడ్డూరంగా ఉందన్నారు. పార్టీ అధ్యక్షుడు తీరు పట్ల కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారన్నారు.

సెంచూరియన్‌లో స్పోకెన్ ఇంగ్లీష్ తరగతులు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో స్పోకెన్ ఇంగ్లీష్ తరగతులను వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ప్రశాంత కుమార్ మహంతి ప్రారంభించారు. బుధవారం సాయంత్రం ప్రారంభమైన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నేడు ప్రతి ఒకరు ఇంగ్లీషులో అనర్గళంగా మాట్లాడే స్థాయికి ఎదగాలన్నారు. దీని వల్ల తమ ఉద్యోగంలో మంచి ప్రగతి సాధించడానికి అవకాశం ఉంటుందన్నారు. రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి మాట్లాడుతూ నాన్ టీచింగ్ సిబ్బంది ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఇంగ్లీషులో ప్రావీణ్యం సంపాదించాలన్నారు. దీనికి రిసోర్సు పర్సన్లగా డాక్టర్ దేవికారాణి, మాధవి వ్యవహరిస్తారని వివరించారు. ఈ కార్యక్రమానికి సంధానకర్తగా ప్రొఫెసర్ ఎంఎల్ఎన్ ఆచార్యులు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ పిఎస్వి రమణారావు, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్వాడీల బిక్షాటన

విజయనగరంలో బిక్షాటన చేస్తున్న అంగన్వాడీలు



బొబ్బిలి.. అంగన్వాడీల సమ్మె శిబిరాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న బేబినాయన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

డిమాండ్ల సాధన కోసం జిల్లా వ్యాప్తంగా అంగన్వాడీలు చేపడుతున్న సమ్మె 9వ రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా బుధవారం స్థానిక కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపి అనంతరం అక్కడి నుంచి ర్యాలీగా వెళ్లి బిక్షాటన చేశారు. ఈ సందర్భంగా ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు బి.పైడిరాజు, సిపిఎం నగర కార్యదర్శి రెడ్డి శంకరరావు, ఐద్వా జిల్లా కార్యదర్శి పి.రమణమ్మ మాట్లాడారు. ఒక్క అవకాశం అన్నందుకు జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకున్న పాపానికి మహిళలు రోడ్లెక్కి బిక్షం ఎత్తుకోవాల్సిన పరిస్థితి ఎదురైందని అన్నారు. ఇన్నిరోజులుగా అంగన్వాడీలు ఇళ్లు, కుటుంబాలను వదిలి రోడ్లెక్కి నిరసనలు తెలుపుతున్నా రాష్ట్ర ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడా లేదన్నారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరుతున్నామన్నారు. 9 రోజులైనా ప్రభుత్వం నుంచి సరైన స్పందన లేకపోవడం బాధాకర మన్నారు. ప్రభుత్వం ఎంత ఆలస్యం చేస్తే అంత పెద్ద ఎత్తున ప్రభుత్వంపై వ్యతిరేకత పెరుగుతుందని హెచ్చరించారు. ఇప్పటికైనా ప్రభుత్వం దిగొచ్చి అంగన్వాడీల డిమాండ్లు నెరవేర్చాలని, లేకపోతే ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అంగన్వాడీల పోరాటానికి ఎపి మెడికల్ రిప్స్ యూనియన్ నాయకులు యుఎస్ రవికుమార్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శశిధర్,సూర్య భగవాన్ లు మద్దతు తెలిపారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట సాయంత్రం నాలుగు గంటల వరకు నిరసన కొనసాగించారు. కార్యక్రమంలో సిఐటియు నగర అధ్యక్షులు బి.రమణ, అంగన్వాడీ కార్యకర్తలు ఆయాలు పాల్గొన్నారు.

కొత్తవలస : కొత్తవలసలో అంగన్వాడీ యూనియన్ నాయకులు కాకర తులసి ఆధ్వర్యాన వంటావార్పు చేపట్టారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు రెడ్డి శంకరావతి, తదితరులు పాల్గొన్నారు.

రామభద్రపురం : స్థానిక బస్టాండ్ సమీపంలో అంగన్వాడీలు దీక్షలు కొనసాగించారు. దీక్షా స్థలానికి సమీపంలో వంటా వార్పు నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి బలసా శ్రీనివాసరావు, నాయకులు సత్యవతి, రాధమ్మ, మేరి, గౌరి పాల్గొన్నారు.

తెర్లాం.. అధికారులకు వినతులిస్తున్న అంగన్వాడీలు

బొబ్బిలి : అంగన్వాడీల పోరాటానికి అండగా ఉంటామని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బేబినాయన అన్నారు. అంగన్వాడీల సమ్మె శిబిరాన్ని బేబినాయన, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి అల్లాడ భాస్కరరావు, పట్టణ, మండల అధ్యక్షులు రాంబార్కి శరత్, వి.సత్యనారాయణ, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గెంబలి శ్రీనివాసరావు సందర్శించి సంఘీభావం ప్రకటించారు. సమ్మెలో భాగంగా అంగన్వాడీలు బిక్షాటన చేసి నిరసన తెలిపారు. అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు చీర కొంగులను జోలిగా పట్టి బిక్షాటన చేశారు. అంగన్వాడీలకు బేబినాయన, గెంబలి శ్రీనివాసరావు, ఇతర నాయకులు డబ్బులు వేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు, అంగన్వాడీ యూనియన్ నాయకులు కామేశ్వరి, అనురాధ, నిర్మల, పప్పల పద్మ, ఉమాగౌరి పాల్గొన్నారు.

శృంగవరపుకోట : పట్టణంలోని తొమ్మిదో రోజు సమ్మెలో భాగంగా అంగన్వాడీలు ఐసిడిఎస్ కార్యాలయం నుంచి దేవి కూడలి వరకు బిక్షాటన చేపట్టారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గడి బంగారునాయుడు, నాయకులు నానాజీ, బూడి అప్పారావు, సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి మద్దిల రమణ, ప్రాజెక్టు లీడర్ డి.శ్యామల, డి.జయలక్ష్మి, ఎఐటియుసి నాయకులు వి.మాణిక్యం, బి.సుశీల పాల్గొన్నారు.

గజపతినగరం : గజపతినగరంలో అంగన్వాడీలు వంటావార్పు కార్యక్రమం చేపట్టారు. నల్లచీరలతో నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో ప్రాజెక్టు అధ్యక్షులు ఎం.సుభాషిని, కార్యదర్శి పి.జ్యోతి, నాయకులు సన్యాసమ్మ, నాగమణి, రవణమ్మ, సుజాత, రాములమ్మ పాల్గొన్నారు.

తెర్లాం : అంగన్వాడి యూనియన్ ఆధ్వర్యంలో ఎంపిడిఒ, తహశీల్దార్, ఎంఇఒ, వైకెపి కార్యాలయాల్లో అధికారులను కలిసి వినతులు అందజేశారు. ఉద్యమానికి తమ వంతు సహాయం అందించాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎ.రమేష్, మండల కార్యదర్శి గోపాల్, యూనియన్ నాయకులు జి.లక్ష్మి, సిహెచ్ రమణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

గజపతినగరం, కొత్తవలస, రామభద్రపురంలో వంటావార్పు చేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు

శృంగవరపుకోటలో బిక్షాటన చేస్తున్న అంగన్వాడీలు

క్రీడా పోటీల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

- 1.10 లక్షల మంది పేర్లు నమోదు
- 321 క్రీడా మైదానాలు సిద్ధం
- కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి వెల్లడి

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలో ఆడుదాం ఆంధ్ర క్రీడల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్టు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ముఖ్యమంత్రికి వివరించారు. జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన ఇంటింటి సర్వే ద్వారా 1.10 లక్షల మంది క్రీడాకారులు యీ పోటీల్లో పాల్గొనేందుకు తమ పేర్లు నమోదు చేసుకున్నట్టు తెలిపారు. ఈ పోటీలను తిలకించేందుకు 9 లక్షల మంది ఆసక్తి వ్యక్తంచేస్తూ పేర్లు నమోదు చేసుకున్నారని పేర్కొన్నారు. ఐదు క్రీడాంశాల్లో పోటీ పడేందుకు 14 వేల మంది ఆసక్తి చూపారని చెప్పారు. జిల్లాలో పురుషుల కంటే మహిళలే అధికంగా క్రీడల్లో పాల్గొనేందుకు తమ పేర్లు నమోదు చేసుకున్నట్టు చెప్పారు. ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం నిర్వహణపై ముఖ్యమంత్రి బుధవారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శారీరక వ్యాయామానికి ఉపయోగపడే క్రీడలనే ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. జిల్లాకు సంబంధించిన వివరాలను కలెక్టర్ వెల్లడించారు. పోటీల నిర్వహణ కోసం 321 క్రీడామైదానాలు సిద్ధం చేశామన్నారు. జిల్లాకు చెందిన అంతర్జాతీయ క్రీడాకారిణులు మత్స్యసంతోషి, ఎస్.పల్లవి, శ్రీలక్ష్మిలను పోటీలకు బ్రాండ్ అంబాసిడర్లుగా నియమిస్తున్నామని పేర్కొన్నారు. గ్రామ స్థాయిలో క్రీడా పోటీల నిర్వహణపై వలంటీర్లు, సచివాలయ సిబ్బందికి శిక్షణ ఇచ్చామన్నారు. ప్రతి మండలంలో పోటీల నిర్వహణకు మండల ప్రత్యేకాధికారులను నియమించామని, డివిజన్ స్థాయిలో ఆర్.డి.ఓలు పర్యవేక్షణ చేస్తున్నారని పేర్కొన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, డిఆర్ఒ ఎస్.డి.అనిత, డిఇఒ లింగేశ్వరరెడ్డి, జిల్లా పరిషత్ సిఇఒ రాజ్‌కుమార్, డిఎంహెచ్ఒ భాస్కరరావు, గ్రామవార్డు సచివాలయాల సమన్వయ అధికారి నిర్మలాదేవి, డిఎస్‌డిఒ తదితరులు పాల్గొన్నారు.

నిషేధిత బిటి-3 పత్తిపంట ధ్వంసం

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి-బొబ్బిలి

నిషేధిత పత్తిని కాల్చివేస్తున్న వ్యవసాయాధికారులు

రామభద్రపురం మండలంలోని కోటశిర్లాంలో సాగు చేస్తున్న బిటి-3 పత్తి సాగును వ్యవసాయ శాఖాధికారులు ధ్వంసం చేశారు. పర్యావరణానికి హాని కలిగించే బిటి-3 పత్తి సాగుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిషేధించినప్పటికి గుంటూరు ప్రాంతానికి చెందిన మాఫియా బిటి-3 పత్తి విత్తనాలు, పంట సాగుకు పెట్టుబడులు ఇచ్చి రైతులకు జరిగే నష్టాన్ని చెప్పకుండా సాగు చేయిస్తోంది. నిషేధిత బిటి-3 పత్తి సాగు చేస్తున్నట్లు తెలియడంతో కోటశిర్లాం, కొండకెంగువ, పాడివానివలస గ్రామాల్లో 'ప్రజాశక్తి' పర్యటించింది. బిటి-3 పత్తి సాగును పరిశీలించి జరిగే నష్టంపై గత నెల 30న కథనాన్ని ప్రచురించడంతో వ్యవసాయ శాఖ ఎడి మజ్జి శ్యామసుందర్ స్పందించారు. పత్తి ఆకులను పరీక్షించగా బిటి-3 పత్తిగా నిర్ధారణ కావడంతో పంటను పూర్తిగా ట్రాక్టర్‌తో దున్ని ధ్వంసం చేశారు. ఇప్పటికే పండిన పత్తిని దగ్ధం చేశారు. ఒకగదిలో నిల్వ చేసిన పత్తిని సీజ్ చేశారు. నిషేధిత పత్తి సాగు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎడి శ్యామసుందర్ హెచ్చరించారు. ఆయనతో వ్యవసాయ శాఖాధికారులు ఉన్నారు.

సంక్షేమ పథకాలపై ఎమ్మెల్యే ఆరా

శృంగవరపుకోట, నెల్లిమర్లలో ప్రభుత్వ పథకాలపై వివరిస్తున్న ఎమ్మెల్యేలు కడుబండి, బడ్డుకొండ

ప్రజాశక్తి-శృంగవరపుకోట

పట్టణంలో ఒకటో సచివాలయ పరిధిలోని శ్రీనివాస కాలనీలో బుధవారం ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయా? లేదా ? అని ఆరాతీశారు. ఏమైనా సమస్యలు ఉన్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అందిన సంక్షేమ పథకాలపై ఆరాతీయడం, గ్రామాల్లో సమస్యల గుర్తింపు, తదుపరి సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టడం, పరిష్కరించడం... ఈ నాలుగు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలోని కీలక అంశాలని తెలిపారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు పెనిశెట్టి రమణ, వెంకట్రావు, కోటిబాబు, గణేష్, కేత వీరన్న, కడారి జయశంకర్, పెంట గణేష్, తదితరులు పాల్గొన్నారు.

వైసిపితో ప్రజలకు మేలు : ఎమ్మెల్యే

నెల్లిమర్ల : వైసిపి ప్రభుత్వంతో ప్రజలకు మరింత మేలు జరుగుతుందని ఎమ్మెల్యే బడ్డు కొండ అప్పల నాయుడు అన్నారు. బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా నగర పంచాయతీ పద్మశాలి వీధి సచివాలయం పరిధిలో ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అందిస్తున్న పథకాలు గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన ఈ మూడేళ్ల కాలంలో అందించిన సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు మన ప్రభుత్వం వచ్చాక కలిగే మేలును వారికి వివరించి ప్రభుత్వ పనితీరు గురించి వారిని అడగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ బంగారు సరోజినీ, మండల పార్టీ ప్రెసిడెంట్ చనమల్ల వెంకట రమణ, నగర పంచాయతీ పార్టీ ప్రెసిడెంట్ చిక్కాల సాంబశివ రావు, వైస్ చైర్మన్లు సముద్రపు రామారావు, కారుకొండ కృష్ణ, టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు, వైసిపి జిల్లా సెక్రటరీ గంట సతీష్ పాల్గొన్నారు.

ప్రజల చెంతకే ప్రభుత్వ సేవలు

తెర్లాం : సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల చెంతకే ప్రభుత్వ సేవలు వచ్చాయని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు తెలిపారు. మండలంలోని సుందరాడ గ్రామంలో సచివాలయ, ఆర్‌బికె, వెల్‌నెస్ సెంటర్ భవనాలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపిపి నర్సుపల్లి ఉమాలక్ష్మి, గర్భాపు రామారావు, వైస్ ఎంపిపి చెపేన సత్యనారాయణ, సర్పంచ్ అద్దంకి దిలీప్ కుమార్, వైసిపి మండల అధ్యక్షుడు తెంటు సత్యంనాయుడు, వైసిపి నాయకులు బోను అప్పలనాయుడు, అర్జునరావు, తదితరులు పాల్గొన్నారు.

తెర్లాం.. ఆర్‌బికె ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే శంబంగి

ఇంధన పొదుపు భావితరాలకు వెలుగు

విద్యుత్తు శాఖ డైరెక్టర్ రమేష్ ప్రసాద్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజేతలకు ప్రశంసాపత్రం అందిస్తున్న డైరెక్టర్ ప్రసాద్

ఈ నెల 14 నుంచి 20 తేదీ వరకు వారం రోజులుగా ఎపి ఇపిడిసి ఎల్ అధ్వర్యంలో జరిగిన ఇంధన పొదుపు వారోత్సవాలు బుధ వారంతో ముగిశాయి. దాసన్నపేట విద్యుత్ భవనంలో జరిగిన ముగింపు కార్యక్రమంలో ఎపి ఇపిడిసిఎల్ ఆపరేషన్ సర్కిల్ డైరెక్టర్ బి.రమేష్ ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంధన పొదుపు అనేది మానవ అవసరాల్లో ఒకటిగా బావించి పొదుపు పాటించాలన్నారు. ప్రతి ఒక్కరూ ఒక సామాజిక బాధ్యతగా పొదుపు పాటించడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించాలన్నారు. పెరుగుతున్న మానవ అవసరాలు అనుగుణంగా విద్యుత్ అందించాలంటే అందుకు సరిపడా వనరులను దృష్టిలో పెట్టుకొని పొదుపు పాటించాలన్నారు. అనంతరం వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, వక్తత్వ, క్విజ్ పోటీలు లో విజేతలకు డైరెక్టర్ చేతులు మీదుగా బహుమతులు అందజేశారు. విద్యుత్ శాఖ ఎస్ఇ ఎం.లక్ష్మణరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సిజిఎం ఒ.సింహాద్రి, ఇఇ పి.హరి విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

శుద్ధ జల ప్లాంటు ప్రారంభం

ప్రజాశక్తి- రేగిడి

శుద్ధజల ప్లాంటును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జోగులు

మండలంలోని సంకిలిలో ఆరోగ్యకరమైన తాగునీరు అందించే ఒదుకు శుద్ధ జల ప్లాంట్‌ను ఎమ్మెల్యే కంబాల జోగులు, వైసిపి మండల అధ్యక్షులు, వైస్ ఎంపిపి వావిలపల్లి జగన్మోహన్‌రావు, సర్పంచ్ బుడుమూరు పట్టాభి, మండల విప్ మజ్జి శ్రీనివాసరావు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజారోగ్యాన్ని కాపాడేందుకు ఇఐడి ప్యారి సుగర్ యాజమాన్యం రెండు శుద్ధ జల ప్లాంట్లను మంజూరు చేసిందన్నారు. ఈ ఆర్ఓ ప్లాంట్లను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వృద్ధులకు వైద్య సేవలు, ఉచిత మందులు పంపిస్తున్నట్లు తెలిపారు.

ఎల్ఐసి ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి-శృంగవరపుకోట

వేతన సవరణ, నియామకాలు, తదితర డిమాండ్లపై పట్టణంలోని ఎల్ఐసి కార్యాలయం ఎదుట బుధవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఎల్ఐసి ఉద్యోగులు నిరసన చేపట్టారు. జాయింట్ ఫ్రంట్ నాయకులు జి.గురు, జగన్నాథం, ఎస్.ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలని వినతి

గజపతినగరం : తుపానుతో నష్టపోయిన రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కూలీలను ప్రభుత్వం ఆదుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాస్, కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి రాకోటి రాములు కోరారు. ఈ మేరకు బుధవారం గజపతినగరం తహశీల్దార్ అరుణ కుమారిని కలిసి వినతి అందించారు.

బయో మెడికల్ వ్యర్థాల నిర్వహణ కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని కుమ్మపల్లిలో బయో మెడికల్ వ్యర్థాల నిర్వహణ కేంద్రాన్ని బుధవారం మాజీ ఎంపి బొత్స ఝాన్సీ, ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ప్రారంభించారు. సుమారు రూ.5 కోట్లతో ఈ పరిశ్రమను ఏర్పాటుచేసినట్లు యాజమాన్య ప్రతినిధులు తెలిపారు. ప్రత్యక్షంగా 40 మందికి, పరోక్షంగా 30 మందికి ఉపాధి కలుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ వి.వి.చిన్నరామునాయుడు, జెడ్‌పిటిసి శానపతి అప్పలనాయుడు, సర్పంచ్ నౌడ అరుణ, తదితరులు పాల్గొన్నారు.

శాఖా గ్రంథాలయం ప్రారంభం

దత్తిరాజేరు : మండల కేంద్రంలో బుధవారం రూ.25 లక్షలతో నిర్మించిన శాఖా గ్రంథాలయాన్ని ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రెడ్డి పద్మావతి, శాఖ గ్రంథాలయ అధికారి సాగి శ్రీనివాసరాజు, తహశీల్దార్ రమేష్, ఎంపిపి గేదెల సింహాద్రిఅప్పలనాయుడు, ఎఎంసి చైర్మన్ వేముల ముత్యాల నాయుడు, జడ్‌పిటిసి సభ్యులు రైతు రాజేశ్వరి, వైస్ ఎంపిపిలు బమ్మిడి అప్పలనాయుడు, మిత్తి రెడ్డి రమేష్ నాయుడు, వైసిపి మండల అధ్యక్షులు రాపాక కృష్ణార్జున, కడుబండి రమేష్ నాయుడు, జిల్లా టెలికం డైరెక్టర్ దత్తి చిరంజీవి, మజ్జి అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

IN THE HONOURABLE COURT OF THE SENIOR CIVIL JUDGE, VIZIANAGARAM
E.P. 52/2017 IN O.S.No. 247/2015

Between:
Pathivada Appalanaidu ......Dhr
And:
Veturu Venkata Mahalakshmi .....Jdr

NOTICE

To:
Veturu Venkata Mahalakshmi W/o Late Narasinga Rao, resident of Rellivalasa village, Poosapatirega Mandal, Vizianagaram District.

Please take notice that the Dhr filed the above case against you for attachment and the above matter stands posted to **05.01.2024.** Therefore, you have to appear before the above said court either personally or through an Advocate duly authorized at **10-30 A.M., on 05.01.2024** before the above court Failing which the matter will be decided as per the material available on record.

CH. RAMBABU
Advocate for the Petitioner
Vizianagaram

IN THE HONOURABLE COURT OF THE SPECIAL JUDICIAL MAGISTRATE OF 1st CLASS (MOBILE) CUM ADDITIONAL JUNIOR CIVIL JUDGE, VIZIANAGARAM
O.S. No. 349/2021

Between:
Nunna Krishna Kumari ......Plaintiff
And:
N. Parvathamma and others ....Defendants

NOTICE

To:
D3. Kethineti Vijaya Lakshmi D/o Seshagiri, aged about 57 years, Hindu, resident of Backside of Mutiyalamma Temple, Thotapalem, Vizianagaram.
D7. K. Jagadeesh, fathers name not known to the plaintiff, aged about 56 years, Electrician, resident of Siddivinayaka Nagar, Phoolbaugh Road, Vizianagaram

Please take notice that the plaintiff filed the above petition against you and others and the above matter stands posted to **02.01.2024** for your appearance before the above said Honourable Court. Therefore, you have to appear before the above said court either personally or through an Advocate duly authorized at **10-30 A.M., on 02.01.2024** before the above court. Failing which the matter will be decided as per the material available on record.

CH. RAMBABU
Advocate for the Petitioner
Vizianagaram

IN THE COURT OF THE CHAIRMAN: MOTOR ACCIDENTS CLAIMS TRIBUNAL CHIEF JUDGE CITY CIVIL COURT AT HYDERABAD.
O.P.No. 985 of 2023

Between:
Nimmaka Saraswathi and 2 others ...Petitioner
AND
S.Jammayya and 2 others ...Respondents

To
R1. S.Jammayya S/o Tavitayya,
Aged: Major, Occ: Driver of A.P.S. R.T.C. bus bearing No.AP 29 Z 3832,
R/o: D.No.1-169, Madiga Street,
Parvathipuram Mandal,
Vizianagarm District-535 522.
Sir,

Please take notice that the Petitioner herein have filed the above O.P. for compensation for the death in a road accident caused by driving the vehicle. The above OP is posted on **24-01-2024** of your notice ‘and counter, if any. Kindly make it convenient to be present, failing which the matter will be decided in your absence.

BY ORDER OF THE COURT.
S.Harinath Reddy
Advocate
Flat no.405, Landmark Residency,
Lane no.2, Street no.6,
Gagallmahal, Domalaguda,
Hyderabad.